

ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్



ప్రజాశక్తి -తిరుపతి టౌన్ హైదరాబాద్‌లో ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో గురువారం ఘంటశాల వేదిక నందు ఆసియా వేదిక్ కల్చరల్ యూనివర్సిటీ వారు తిరుపతికి చెందిన సమాజ సేవకుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధులుగా ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు విచ్చేసారు. ఈ సందర్భంగా మాజీముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కర్ రావు మాట్లాడుతూ సమాజం పట్ల ప్రతి పౌరుడూ అంకితభావంతో సేవలు చేయాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆసియా వేదిక్ యూనివర్సిటీ కోఆర్డినేటర్ ఆకుల రమేష్, తెలంగాణ ప్రజా కాంగ్రెస్ అధ్యక్షులు గూడూరు చెన్నా రెడ్డి, శ్రీనాథ మహాకవి మనవడు కావూరి శ్రీనివాస్, మహేంద్ర రెడ్డి, రామారావు తదితరులు పాల్గొన్నారు.

టిటిడి ఇన్‌ఛార్జి ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



తిరుమల తిరుపతి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా అనిల్ కుమార్ సింఘాల్‌కు ప్రభుత్వం బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుత ఈఓ ధర్మారెడ్డి కుమారుడి మరణంతో ఆయన కొద్ది రోజుల పాటు విధులకు దూరంగా ఉండనున్నారు. దీంతో గతంలో ఈవోగా పని చేసిన ఐఏఎస్ అధికారి అనిల్ కుమార్ సింఘాల్‌కు తాత్కాలికంగా బాధ్యతలు కేటాయించారు. జనవరి 2వ తేదీ వరకు ధర్మారెడ్డికి ప్రభుత్వం సెలవు మంజూరు చేసింది. ఇదే సమయంలో తిరుమలలో భక్తుల రద్దీ పెరుగుతోంది. ప్రస్తుతం తిరుమలలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ధనుర్మాసం మొత్తం శ్రీవారికి సుప్రభాత సేవ రద్దు చేసారు. జవనరి 2వ తేదీ నుంచి పది రోజుల పాటు భక్తులకు వైకుంఠ ద్వార దర్శనం కల్పించనున్నారు. దీని కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. జనవరి 1న కొత్త సంవత్సరం నాడు పెద్ద సంఖ్యలో తిరుమలకు వీఐపీల తాకిడి ఉంటుంది. ఈ సారి వీఐపీల సిఫార్సు లేఖలను అనుమతించకూడదని బోర్డు నిర్ణయించింది. సాధారణ భక్తులకు ప్రాధాన్యత దక్కేలా ప్రోటోకాల్ జాబితాలో ఉన్న ప్రముఖులు నేరుగా వస్తే వారికి బ్రేక్ దర్శనం కల్పించాలని డిసైడ్ అయింది. వైకుంఠ ద్వార దర్శనం సందర్భంగా రోజుకు 25 వేలు చొప్పున 2.50 లక్షల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఆన్‌లైన్ లో, రోజుకు 50వేల చొప్పున 5 లక్షల సర్వదర్శనం టైం స్లాట్ టోకెన్లు తిరుపతిలో కౌంటర్ల ద్వారా మంజూరు చేయడానికి టీటీడీ నిర్ణయం తీసుకుంది.

దర్శన టికెట్ ఉన్నవారిని మాత్రమే ఆలయంలో దర్శనానికి అనుమతించడం జరుగుతుందని, దర్శన టికెట్ లేనివారు తిరుమలకు రావచ్చుగానీ దర్శనానికి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేసారు. జనవరి 1న సర్వదర్శనం టికెట్లు ప్రారంభమవుతాయి. టికెట్లు పూర్తయ్యే దాకా తిరుపతిలో కౌంటర్లు తెరచి ఉంచనున్నారు. వైకుంఠద్వారా దర్శనానికి సంభందించి రోజుకు 25 వేల చొప్పున 2.5 లక్షల రూ.300 దర్శనం టిక్కెట్లు ఆన్‌లైన్ లో కేటాయిస్తామని టీటీడీ ప్రకటించింది. ఇప్పటికే బ్రేక్ దర్శనాల్లో చేసిన మార్పు లతో కొంత మేర సామాన్య భక్తులకు శ్రీవారి దర్శనం సులభతరం అవుతోంది. ఈ విధానం మరి కొన్ని రోజులు పరిశీలించిన తరువాత కొనసాగింపు అంశం పైన నిర్ణయం తీసుకోనున్నారు. ముక్కోటి ఉత్సవాలు పూర్తయిన తరువాత సంక్రాంతి పర్వదినాల్లోనూ తిరుమలలో రద్దీ ఎక్కువగా ఉంటుందని అంచనా వేస్తున్నారు. అప్పటి వరకు వీఐపీ సిఫార్సు లేఖలను పక్కన పెట్టాలని నిర్ణయించారు.



చెవిరెడ్డి తల్లిని పరామర్శిస్తూ...



కన్నీరుమున్నీరైన ధర్మారెడ్డి

చెవిరెడ్డి, ధర్మారెడ్డిలను పరామర్శించిన సీఎం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురువారం తుమ్మలగుంటలోని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఇంటికి చేరుకుని ఆయనను, కుటుంబ సభ్యులను ఓదార్చారు. రెండు రోజుల క్రితం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తండ్రి చెవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి మతి చెందిన విషయం విదితమే. గురువారం ఉదయం అమరావతి నుంచి ముఖ్యమంత్రి నంద్యాలకు చేరుకుని టీటీడీ ఈవో ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళి రెడ్డి మతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఓదార్చి ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని, అక్కడ నుండి రోడ్డు మార్గాన తుమ్మలగుంట లోని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. ఎమ్మెల్యే తల్లి మునిరత్నమ్మ చేయి పట్టుకుని ముఖ్యమంత్రి ఓదార్చారు. చెవిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అక్కడ నుంచి రోడ్డు మార్గాన రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రి ప్రత్యేక విమానంలో గన్నవరం బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి వెంట రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కె నారాయణస్వామి, రాష్ట్ర భూగర్భ గనులు శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, చిత్తూరు జడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎమ్మెల్యే లు భూమన కరుణాకర్ రెడ్డి, బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆదిమూలం, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి, జిల్లా కలెక్టర్ కె వెంకటరమణారెడ్డి, చిత్తూరు కలెక్టర్ హరి నారాయణన్, ఎస్పీలు పరమేశ్వర్ రెడ్డి, రిశాంత్ రెడ్డి, తిరుపతి నగర మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు

ధర్మారెడ్డిని పరామర్శించిన సిఎం

ప్రజాశక్తి -తిరుమల తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో ధర్మారెడ్డి కుటుంబాన్ని ఏపీ ముఖ్యమంత్రి జగన్ పరామర్శించారు. ధర్మారెడ్డి కుమారుడు చంద్రమౌళిరెడ్డి గుండెపోటుతో హఠాన్మరణం చెందడంతో నంద్యాల జిల్లా పారుమంచ్చాల గ్రామానికి వెళ్లి ధర్మారెడ్డికి ధైర్యం చెప్పారు. చంద్రమౌళిరెడ్డి ఫొటోకు జగన్ నివాళు లర్పించే సమయంలో ధర్మారెడ్డి వెక్కి వెక్కి ఏడ్చారు. జగన్ ఆయనను ఓదార్చుతూ ధైర్యాన్ని చెప్పారు. కుటుంబ సభ్యులతో కాసేపు ముచ్చటించారు. కాగా పన్నెండు రోజుల పాటు ధర్మారెడ్డి సెలవు పెట్టారు. ఆయన బాధ్యతలను అనిల్ కుమార్ సింఘాల్ కు అప్పించారు.

దండు 'కుందాం'..!

అడవిలో గుట్టుచప్పుడు కాకుండా తవ్వకాలు
విలువైన తెల్లబంగారాన్ని కొల్లగొట్టే ప్రయత్నం

ప్రజాశక్తి - ఓజిలి

ప్రభుత్వ అటవీ భూముల్లో దొంగలు పడ్డారు. సహజ వనరులను మూడో కంటికి తెలియకుండా అక్రమంగా తరలించడానికి తెల్లరాయి ముఠా తవ్వకాలు చేపట్టింది. అటవి భూముల్లో ఉన్న విలువైన తెల్లరాయి (తెల్ల బంగారం) ఖనిజాన్ని అక్రమ తవ్వకాలు చేసి లక్షల రూపాయలు పోగు చేసుకొనుటకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. తెల్లరాయికి విదేశాల్లో మంచి డిమాండ్‌తో పాటు మంచి ధర పలుకుతోంది. ఈ తెల్లరాయి పొడిని వివిధ వస్తువుల తయారీకి ఉపయోగిస్తుంటారు. ఈ నేపథ్యంలోనే గుట్టు చప్పుడు కాకుండా అటవీ ప్రాంతంలో గత మూడు రోజులుగా అక్రమ తవ్వకాలు జరుగుతుంటే అటవీ శాఖ అధికారులకు తెలిసే జరిగిందా ? లేక అటవీ శాఖ అధికారులు నిద్రావస్థలో ఉన్నారా ? అన్నది అనుమానమే. అటవి ప్రాంతంలో మూడు రోజులు పాటు తిష్ట వేసి వైట్‌క్వార్జ్ రాయిని వెలికి తీశారు. వివరాల్లోకెళ్తే తిరుపతి జిల్లా ఓజిలి మండలంలోని 'కుందాం' పంచాయతీ పరిధిలో కొండతిప్ప కింద సర్వే నంబర్ ఒకటిలో ప్రభుత్వ అటవీ భూములు ఉన్నాయి. ఈ భూములను కొంతమంది ఆక్రమించుకొని జామాయిల్ సాగు చేసుకుంటున్నారు. ఈ ప్రాంతంలో తెల్లరాయి ఖనిజం ఉండడంతో కన్నేసిన అక్రమార్కులు రాత్రివేళల్లో ఈ



ప్రాంతానికి చెందిన నాయకుల జెసిబితో విచ్చలవిడిగా ఖనిజాన్ని తవ్వేసి టన్నులకొలది తెల్లరాయి గుట్టలుగా పోగు వేసి అక్రమ రవాణా ప్రయత్నాలు మొదలుపెట్టారు. నివాస ప్రాంతాలకు దగ్గరగా ఈ తంతు జరుగుతున్నా ఫారెస్ట్ అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అటవీ ప్రాంతంలో జరిగే అసాంఘిక కార్యకలాపాలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వవలసిన ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ గార్డ్‌లు ఏం చేస్తున్నారనేది అర్థం కావడంలేదని, అందులో గల లోగుట్టు ఏమిటోనని ప్రజలు అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. తెల్లరాయి ముఠా సభ్యులు గ్రామానికి చెందిన పలువురిని తాము అధికారులందరినీ సంప్రదించే తెల్ల రాయిని తీస్తున్నామని బహిరంగంగా చెప్పడం విశేషం. తెల్లరాయి ముఠా సభ్యులు ఎవరి అండదండలతో బహిరంగంగా రాత్రి వేళల్లో అక్రమ తవ్వకాలు చేస్తున్నారో ? ఉన్నత అధికారులు ఆ దిశగా విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి. ఇంత జరుగుతున్న వెంకటగిరి అటవీశాఖ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్లు వ్యవహరించడం పట్ల అటవీ సంపదను కొల్లగొట్టే అడవి దొంగలకు పరోక్ష సహాయం సహకారం అందించినట్లే నని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ విషయం గురించి వెంకటగిరి ఫారెస్ట్ డిప్యూటీ రేంజర్‌ను వివరణ అడిగేందుకు ప్రయత్నించగా అధికారులు అందుబాటులోకి రాలేదు.

ఎకరాకు రూ.20 లక్షలివ్వాల్సిందే..!

ప్రజాశక్తి - ఓజిలి

'మాకు వేరే జీవనాధారం లేదు... అభివృద్ధి పేరుతో మా పొలాలను తీసుకుంటే మేం ఎలా బతకాలి.. మా ప్రాంతంలో ఎకరా 20 లక్షలు పోతుంది.. అభివృద్ధికి మేం అడ్డుకాదు.. అయితే కనీసం 20 లక్షలైనా ఇస్తే ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకుని ఎలాగోలా బతుకుతాం' అని సాగరమాల రోడ్డు ప్రాజెక్టు భూబాధితులు ఆర్డీవోకు తమ గోడు వినిపించారు. సాగరమాల ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా కష్ణపట్నం పోర్ట్ నుండి బెంగళూరుకు వెళ్లే రహదారికి సంబంధించిన భూబాధితులతో సూళ్లూరుపేట ఇంచార్జ్ ఆర్డీవో కిరణ్ కుమార్ ఓజిలి మండల కేంద్రంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కిరణ్ కుమార్ మాట్లాడుతూ కష్ణపట్నం పోర్ట్ నుండి బెంగళూరుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సాగరమాల ప్రాజెక్టు ద్వారా ఆరు వరసల రహదారిని ఏర్పాటు చేస్తుందని, ఇందులో భాగంగానే ఓజిలి మండలంలోని కురుగొండ గ్రామంలోని సంబంధిత రైతులతో సమావేశం

ఆర్డీవోతో సాగరమాల భూబాధితుల గోడు



నిర్వహించారు. మండలంలోని కురుగొండ గ్రామానికి చెందిన 43 మంది రైతుల ద్వారా 42 ఎకరాలు భూమి అవసరం ఉందని రహదారికి కావలసిన భూ బాధితులకు నష్టపరహారం కింద ప్రభుత్వం మెట్ట భూములకు ఎకరాకు 6 లక్షల 98 వేల రూపాయలు, రోడ్డుకు సమీపంలో ఉన్న భూమికి ఎకరాకు 7 లక్షల ఇరవై రెండు వేల రూపాయలు ప్రభుత్వం గరిష్ట ధర నిర్ణయించిందని తెలిపారు. నిర్ణయించిన ధరపై జిల్లా కలెక్టర్ 10 శాతం నుంచి 20 శాతం పెంచే అవకాశం ఉందని పేర్కొన్నారు. అధిక ధరలు వస్తాయని దళారుల మోసపూరిత మాటల్ని నమ్మి రైతులు మోసపోవద్దని పేర్కొన్నారు. నష్టపోతున్న రైతులకు ఆశించినంత ధర ప్రభుత్వం చెల్లించదని తెలియజేశారు. భూముల్లో ఉన్న నీటి బోర్లకు అదనంగా డబ్బులు చెల్లిస్తామని, ఇదివరకే పంటలు ఉంటే పంటలకు సంబంధించిన హార్టికల్చర్ అధికారుల ద్వారా నష్టపరిహారం ఎంతవరకు ఇవ్వచ్చు అందుకు సంబంధించి ప్రభుత్వం నగదును చెల్లిస్తుంన్నారు. దీనిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రైతులు తెలియజేయాలని తెలిపారు. రైతులు మాట్లాడుతూ కురుగొండ గ్రామంలో ఎకరా 20 లక్షల రూపాయల వరకు ధర పలుకుతుందని ప్రభుత్వం కేటాయించే నష్టపరిహారం ఏమాత్రం సరిపోదన్నారు. ఈ రహదారి ఏర్పాటు చేస్తే మామిడి కాలువ నది నుండి వర్షాకాలంలో నీటి ప్రవాహం అధికంగా ఉంటుందని, దీంతో వరద ప్రవాహం పెరిగి గ్రామానికి వస్తుందని ఆర్డీవో దష్టికి రైతులు తీసుకెళ్లారు. ఈ సమావేశాల్లో తహసిల్దార్ డి.లాజరస్ , డిప్యూటీ తాసిల్దార్ పవన్ కుమార్, డిఎఓ బెన్నీ ,ఆర్‌ఐ విజయ్ కుమార్, మండల సర్వేయర్ గోపిరెడ్డి ఉన్నారు.

అన్నమాచార్యలో విదేశీ విద్యపై ఔత్సాహిక సదస్సు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

విదేశాల్లో విద్య నభ్యసించాలనుకొనే వారికి ఎటువంటి అవకాశాలు, అర్హతలు అవసరమవుతాయో అనే అంశంపై ' విదేశాల్లో చదువుకోవడానికి ఔత్సాహితుల కోసం ఒక రూట్ మ్యాప్" సెమినార్ ను తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ అన్నమాచార్య ఇన్స్ టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ లో నిర్వహించారు. హైదరాబాద్ కు చెందిన సిగ్నాక్స్ కన్సల్టెన్సీ అకడమిక్ కన్సల్టెంట్ మిస్ సీపీ గాయత్రీ దేవి, ఏఐటీఎస్ తిరుపతి పూర్వ విద్యార్థి విదేశాల్లో చదువుకోవడానికి ఉన్న అవకాశాలు, అర్హతల గురించి ఆమె తన విలువైన అంతర దష్టిని విద్యార్థులకు చక్కగా వివరించారు. విద్యార్థులు వక్తతో మాట్లాడి విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనే తమ కలలను సాకారం చేసుకోవడానికి అనుసరించాల్సిన మార్గాలను అడిగి



తెలుసుకున్నారు. ఎఐటిఎస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాథమునిరెడ్డి మాట్లాడుతూ ఎపి రాష్ట్ర విద్యార్థులు విదేశాల్లో చదువులపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారనే గణాంకాలను అందించి, విద్యార్థులను కెరీర్‌లో పెద్దఎత్తున సాధించేలా ప్రోత్సహించారు. సెమినార్‌లో పూర్వ విద్యార్థుల కో-ఆర్డినేటర్లు మిస్ పి.చరిష్మా, కె.సాయి అభినవ్, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఎ.అనిల్‌తో పాటు విదేశాల్లో చదువుకునేందుకు ఆసక్తి గల 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

'నూతన దర్శన సమయ మార్పు విధానం బాగోలేదు'

ప్రజాశక్తి - తిరుమల

తిరుమల శ్రీవారిని తెదేపా నేత మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పుట్టా సుధాకర్ యాదవ్ దర్శించుకున్నారు. గురువారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొన్నారు. దర్శనానంతరం ఆలయం వెలుపల పుట్టా సుధాకర్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, దౌర్జన్యాలు నుంచి విముక్తి కలిగించాలని శ్రీవారిని ప్రార్థించానన్నారు. టిటిడి నూతనంగా తీసుకొని వచ్చిన వీఐపీ బ్రేక్ దర్శన సమయం మార్పు వల్ల సామాన్య భక్తులకు అసౌకర్యం కలిగేలా వుందన్నారు. తిరుమలలో గదులు పొందిన భక్తులకు డిపాజిట్ డబ్బులు త్వరగా టిటిడి ఇవ్వాలని కోరారు.

శ్రీవారి సేవలో తెలంగాణ ప్రముఖులు

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. గురువారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో తెలంగాణ మంత్రి జగదీష్ రెడ్డి, తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు స్వామివారి సేవలో పాల్గొన్నారు.. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి శ్రీవారి తీర్థప్రసాదాలను అందజేశారు..

రవాణా మౌలిక సదుపాయాలు కల్పించండి : ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

జిల్లాలో కీలకమైన రవాణా మౌలిక సదుపాయాలను కల్పించాలని కేంద్రమంత్రి నితిన్ గట్కరీని తిరుపతి ఎంపి గురుమూర్తి ఢిల్లీలో కలిసి విన్నవించారు. పలు కీలక రహదారులు, వాటిపై నిర్మించాల్సిన హైలెవల్ బ్రిడ్జెస్‌కు సంబంధించి గతంలో కోరిన విషయాల గురించి మరోమారు విన్నవించారు. వెంకటగిరి నియోజకవర్గానికి సంబంధించి రైల్వేస్టేషన్‌కు సమీపంలో గేటు దగ్గర జాతీయ రహదారి 565పై రోడ్డు ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. రేణిగుంట మండలం కొత్తపాలెం - కురుకాలువ గ్రామాలలో ఉన్న భూమిలో హైవే నిర్మాణం సాగుతుందని, ఈ హైవేకి ఇరువైపులా ఉన్న మిగిలిన ఎ.84.09 సెంట్ల భూమి స్విమ్స్ స్వంత భూమి అని హైవేకి ఇరువైపులా ఉన్న భూముల్లో మెడికల్ రీసెర్చ్, కార్డియాక్ సైన్స్, న్యూరో సైన్స్, నెఫ్రో సైన్స్ బ్లాక్స్, వరల్డ్ క్లాస్ రీహాబిలిటేషన్ అండ్ పాలియేటివ్ కేర్ సెంటర్, ఇతర నిర్మాణాలకు సంబంధించిన వివిధ భవనాలు సమీప భవిష్యత్ లో ఏర్పాటు చేయనున్నారని, రోగులకు, ప్రజలకు ఇబ్బందిగా లేకుండా ఈ ఆరు లేన్ల రహదారిపై రోగులకు సౌకర్యంగా అండర్ బ్రిడ్జి నిర్మించాలని విన్నవించారు.

తిరుపతి - తిరుత్తణి - చెన్నై జాతీయ రహదారి 205 విస్తరించి ఉన్న ఈ రహదారిపై చాలా కాలంగా అనేక ప్రదేశాలలో కాంట్రాక్టర్ చేయవలసిన అనేక పనులు పెండింగ్లో ఉన్నాయి, దీని వలన ఈ రహదారిలో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బంది ఏర్పడుతుంది. అలాగే, భారీ వర్షాల కారణంగా అనేక చోట్ల రోడ్డు సరిగా లేక ప్రయాణికులకు ప్రమాదకర పరిస్థితి నెలకొందని ఈ పనులను త్వరితగతి పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కూడా కోరారు. తడ , శ్రీకాళహస్తి, ఊతుకోట, సత్యవేడు, తడ కి సంబందించిన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చే



అంశాన్నిమరో మారు విన్నవించారు.

ప్రాంతీయ పర్యాటక కార్యాలయం ఏర్పాటు చేయాలి

తిరుపతిలో జాతీయ ప్రాంతీయ పర్యాటక కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి విన్నవించారు. తిరుపతి ప్రాంతం భారతదేశంలోని అత్యంత ప్రసిద్ధ ఆలయ నగరమని రోజుకు లక్షా అరవై వేల మంది పర్యాటకులు, సంవత్సరానికి 5.8 కోట్ల మంది యాత్రికులు పర్యటించే నగరమని పేర్కొన్నారు. తిరుపతిలో జాతీయ పర్యాటక ప్రాంతీయ కార్యాలయం ఉండటం ముఖ్యమని పేర్కొన్నారు

వైకుంఠ ఏకాదశికి శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబు

తిరుపతి సిటి : జనవరి 2, 3 తేదీలలో వైకుంఠ ఏకాదశి, ద్వాదశి పర్వదినాలను పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం శ్రీనివాసమంగాపురంలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో టీటీడీ ఏర్పాట్లు చేపట్టింది. తిరుమల శ్రీవారిని సందర్శించుకోలేని భక్తుల సౌకర్యార్థం శ్రీనివాసమంగాపురంలో వైకుంఠద్వారం ఏర్పాటు చేయనున్నారు. జనవరి 3వ తేదీ ఉదయం 10 నుండి 11 గంటల వరకు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్‌ను ఆలయ నాలుగు మాడ వీధులలో ఊరేగించి, పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా జనవరి 2, 3 తేదీలలో ఆర్జిత కల్యాణోత్సవం సేవ రద్దు చేశారు. భక్తుల సదుపాయం కోసం చలువపందిళ్లు, బారికేడ్లు, క్యూలైన్లు, వాహనాల పార్కింగ్, భక్తులకు సమాచారం తెలిపే ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు. హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బెస్త కార్పొరేషన్‌కు నిధులు మంజూరు చేయాలి

తిరుపతి టౌన్ : జగన్మోహన్ రెడ్డి పాలన మూడున్నర ఏళ్ళు దాటుతున్నా బెస్త కులస్తుల సంక్షేమానికి, స్వయం ఉపాధి, ఆర్థికంగా ఇంత వరకు ఒక్క అడుగు కూడా వేయక పోవడం బాధాకరమని టీడీపీ బెస్త సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ యాటగిరి రాంప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. గురువారంఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి లోనిక్రిష్ణాపురం టానా సర్కిల్ లో టీడీపి బెస్త రాష్ట్ర సభ్యులు భక్తవత్సలం, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు బొంబాయి దుర్గాలు ఏర్పాటు చేసిన రిలే నిరాహార దీక్షను తిరుపతి ఇంఛార్జి సుగుణమ్మ ప్రారంభించారు. తిరుపతి పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు నరసింహయాదవ్ దీక్షను విరమింపజేశారు. నాయకులు చిన్నబాబు, సదాశివమ్, దంపూరి భాస్కర్, మునికృష్ణ, జగన్నాధం, శంకర్ పాల్గొన్నారు. ఈ దీక్షలో మానా చంద్ర శేఖర్, మునిబాల సుబ్రహ్మణ్యం, రమణ, రామ్మూర్తి, గురు స్వామి, శంకర, శారదమ్మ, సత్యమ్మ, నిర్మల, సుగుణ, చిలకమ్మ తదితరులున్నారు.



ఇస్రో ఘనత

177 'విదేశీ' ఉపగ్రహాలు విజయవంతం
'షార్'కు రూ.1,100 కోట్ల ఆదాయం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) జనవరి, 2018 నుంచి దాదాపు రూ.1,100 కోట్ల వ్యయంతో 19 దేశాలకు చెందిన 177 ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించింది. ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, కొలంబియా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, ఇజ్రాయెల్, ఇటలీ, జపాన్, లిథువేనియా, లక్సెంబర్గ్, మలేషియా, నెదర్లాండ్స్, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, సింగపూర్, స్పెయిన్, స్విట్జర్లాండ్, యునైటెడ్ కింగ్‌డమ్, యుఎస్‌ఎ నుండి ఉపగ్రహాలను ప్రయోగించింది. విదేశాలతో చేసుకున్న వాణిజ్య ఒప్పందాల ప్రకారం ఆయా దేశాల ఉపగ్రహాలను పీఎస్‌ఎల్‌వీ, జీఎస్‌ఎల్‌వీ-ఎంకెఐఐఐ ద్వారా ప్రయోగించారు.

జనవరి 2018 నుండి నవంబర్ 2022 వరకు ఇస్రో 177 విదేశీ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించింది. విదేశీ మారకం ద్వారా 94 మిలియన్ యుఎస్ డాలర్లు, 46 మిలియన్ యూరోలను ఆర్జించింది. కేంద్ర అంతరిక్ష శాఖ సహాయ మంత్రి డా. జితేంద్ర సింగ్ రాజ్యసభలో ఈ సమాచారం ఇచ్చారు. అంతరిక్ష రంగంలో అనేక దార్శనిక సంస్కరణల కోసం ప్రభుత్వం జూన్ 2020లో చర్య తీసుకుంది. ప్రభుత్వేతర సంస్థలు కూడా వాణిజ్య లక్ష్యాలతో అంతరిక్ష రంగ కార్యకలాపాల్లో నిమగ్నమయ్యాయని తెలిపారు. అంతరిక్ష రంగంలో మెరుగుదల కోసం ఎల్‌విఎం 3 ప్రయోగానికి దారితీశాయి. ఇందులో 36 వాణిజ్య ఉపగ్రహాలు ఉన్నాయి. ఇటీవల ప్రైవేట్ రంగ స్కైరూట్ ఏరోస్పేస్ ఉపగ్రహ ప్రయోగాన్ని ప్రారంభించిందని ఆయన చెప్పారు.

ఇస్రో ఇటీవల 36 బ్రాడ్‌బ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహాల తొలి వాణిజ్య ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. అత్యంత బరువైన రాకెట్ జిఎస్‌ఎల్‌వి -ఎంకెఐఐఐ ప్రయోగం విజయవంతమైంది. చరిత్రలో తొలిసారిగా జీఎస్‌ఎల్‌వీ రాకెట్‌ను వాణిజ్య ప్రయోగానికి వినియోగించారు. ఇన్-స్పేస్ అబ్జర్వేషన్ సిస్టమ్ ద్వారా ప్రభుత్వేతర సంస్థలు అంతరిక్ష కార్యకలాపాలను అనుమతించేలా చర్యలు తీసుకున్నారు. ఇది



స్టార్టప్‌లకు ఉపయోగపడింది. దాదాపు 111 స్టార్టప్‌లు ఈ విధానంలో నమోదు చేసుకున్నాయని మంత్రి తెలిపారు.

మామిడిలో సస్యరక్షణతో దిగుబడులు



ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: సరైన యాజమాన్యంతో మామిడిలో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల ఉద్యానశాఖాధికారిణి శివకుమారి సూచించారు. గురువారం ఆమె మండలంలోని పలు గ్రామాలలో మామిడి పంటలను పరిశీలించారు. మామిడిలో మచ్చ తెగులు ఆశిస్తోందని.. ఎండిన కొమ్మలను, ఆకులను తొలగించి తోటలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కొమ్మలు కత్తిరింపుతో తెగుళ్ల ఉధతిని తగ్గించుకోవచ్చని తెలిపారు. టెంక పురుగు మామిడిలో ఎక్కువగా ఆశించి నష్టపరుస్తుందని.. తోటలో పిందెలు బఠానీ సైజులో ఉన్నప్పుడు పెద్దపురుగు చురుకుగా మారి ఆకులను, లేత కొమ్మలను బాగా తిని సంపర్కం జరుపుతాయన్నారు. తల్లి పురుగులు కాండం, కొమ్మలు కలిసే చోట జూలై నుంచి ఫిబ్రవరి వరకు ఉంటాయన్నారు. తోటల్లో సమస్యలు ఉంటే సలహాలు, సూచనల కోసం ఉద్యాన కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యానశాఖ సహాయకురాలు పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.

కేకేసీలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



ప్రజాశక్తి- పుత్తూరు టౌన్: పరమేశ్వరమంగళంలోని కేకేసీ హోమియోపతి కళాశాలలో గురువారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను కళాశాల ఛైర్మన్ కుప్పయ్యశెట్టి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ నరసింహారావు, ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఝాన్సీరాణి, హోమియోపతి కళాశాల ప్రిన్సిపల్ శరవణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరులోని శ్రీకష్ణ సేవా సమితి అధ్యక్షుడు డాక్టర్ శ్యామసుందరరావు మినీ గురుకులంలో గురువారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పదిమంది విద్యార్థుల జన్మదినాన్ని పురస్కరించుకుని విద్యార్థులచే భారీ కేక్ కట్ చేయించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రమా ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ పున్నెపల్లి సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయురాలు ప్రయాతి మేరీ , రవీంద్రబాబు పాల్గొన్నారు.



జింక చంద్రశేఖర్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి- క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని భౌతిక శాస్త్రం పరిశోధక విద్యార్థి జింక చంద్రశేఖర్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్ర విభాగానికి చెందిన సీనియర్ ఆచార్యులు, వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఓఎండి హుస్సేన్ పర్యవేక్షణలో ' సింథసిస్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ నానో క్రిస్టలైన్ లిథియం టైటనేట్ ఎలక్ట్రోడ్స్ ఫర్ ఎనర్జీ స్టోరేజి" అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు. ఇందుకుగాను ఆయనకు డాక్టరేట్ డిగ్రీని ప్రదానం చేసినట్లు వెల్లడించారు.



అంగన్‌వాడీ పాలు.. నేలపాలు..!

ప్రజాశక్తి-బీఎన్‌కండ్రిగ: అంగన్‌వాడీ పిల్లలకు ఇవ్వాల్సిన పాలు నేలపాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తి రవి డిమాండు చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని పదోమైలు మెయిన్ రోడ్డు పక్కనే అంగన్వాడీ పిల్లలకిచ్చే పాల ప్యాకెట్లు వథాగా నేలపాలు చేశారన్నారు. ప్రభుత్వం పిల్లల కోసం అందిస్తున్న పాల ప్యాకెట్లు నేలపాలు చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొల్లపల్లె విద్యార్థులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: ఈనెల 21వ తేదీన శ్రీకాళహస్తి ఎస్‌వీపీ డిగ్రీ కళాశాలలో జరిగిన జిల్లా హ్యాండ్‌బాల్ పోటీల్లో గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు భారతి తెలిపారు. తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి సాయి, యామిని ఎంపికయ్యారని.. అనంతపురం జిల్లా కదిరిలో ఈనెల 28,29,30 తేదీలలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పీడీ గోపీకష్ణ తెలిపారు. వీరి ఎంపికపై సర్పంచ్ విరిత దేవేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ మునస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

తిమ్మయ్యగుంటలో పశువులకు వైద్యసేవలు

ప్రజాశక్తి-రేణిగుంట: తిమ్మయ్యగుంటలో గురువారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు, జీవాలకు, కోళ్లకు వైద్యసేవలు అందించారు. వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సునీత, ట్రస్టు ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్, సిబ్బంది వెంకట కుమార్, శంకరయ్య, జ్యోతి, ఇందుమతి, నాగమణి, స్వాతి, గౌతమి, గోపాలమిత్ర మునికష్ణ తదితరులు పాల్గొన్నారు.

పట్టణానికి దూరంగా పందులు

ప్రజాశక్తి-గూడూరు: గూడూరు మున్సిపాలిటీకి దూరంగా పందులను తరలించాలని నూతన మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ సూచించారు. ఇప్పటికే విడతల వారీగా పందుల యజమానులతో సమావేశాలు నిర్వహించి పందులను తరలించాలని ఆదేశాలు జారీ చేశామని.. ఇకపై పందులు పట్టణంలో సంచరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం పందుల యజమానులతో సమావేశమయ్యారు. త్వరలోనే పట్టణంలోని అన్ని ప్రాంతాల్లోనూ పందులను తరలిస్తామని హామీ ఇచ్చారు.



గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-ఓజిలి: గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దష్టి సారించాలని ఈవోపీఆర్డీ షేక్ సిరాజ్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతాయని, ముందస్తు చర్యల్లో భాగంగా శానిటేషన్ చేయించాలన్నారు. దోమలు వ్యాపించకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు.

ప్రపంచ గణిత మేధావి.. శ్రీనివాసరామానుజన్



ఎస్వీయూలో..



నాగలాపురంలో...

ప్రజాశక్తి-క్యాంపస్ : ప్రపంచంలోనే అతి పిన్న వయసులోనే గొప్ప గణిత ప్రపంచ మేధావిగా ప్రసిద్ధిగాంచిన వ్యక్తి శ్రీనివాస రామానుజన్ అని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య వి.శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని గణిత విభాగం ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్న విషయానికీ లెక్కలు ఎంతో ప్రాముఖ్యత వహిస్తున్నాయన్నారు. శ్రీనివాస రామానుజన్ వంటి మేధావి 32 సంవత్సరాల వయసులోనే మరణించకుండా మరికొద్ది కాలం బతుకుంటే భారతదేశం ఇంకా మరింత అభివద్ధి పథంలో ముందుకు దూసుకెళ్లేదని ఆకాంక్షించారు. గణిత శాస్త్రంలో అనేకమైన పుష్కలమైన ఉపాధి అవకాశాలు ఉన్నాయని.. విద్యార్థులు చక్కగా పట్టుదలతో చదివి వివిధ రంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య శ్రీనివాసులు రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య రామకష్ణారెడ్డి, ఆధ్యాపకులు ఆచార్య కే ఎమ్ భాను, రామకష్ణ ప్రసాద్, విశ్వనాథరెడ్డి, భాస్కర్ రెడ్డి, శ్రీనాథ్, విభాగాధిపతి డాక్టర్ భారతి, ఆచార్య సుగుణమ్మ, డాక్టర్ జయసుబ్బారెడ్డి, డాక్టర్ సుధాకరయ్య, ఇతర సీనియర్, విశ్రాంత అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


తిరుపతి మంగళం: భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని మంగళం పంచాయతీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మంగళం ట్రెండ్స్‌లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు వ్యాస రచన, వక్తత్వ, చిత్రలేఖనం, పాటల పోటీలు, గణిత క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ప్రధానోపాధ్యాయులు కేశవులునాయుడు, ఉపాధ్యాయులు మునిరత్నం, జగన్నాథరావు, ఎన్ వి కవిత, లావణ్య కుమారి, యమున పాల్గొన్నారు. అలాగే తిరుపతి-కరకంబాడి మార్గంలోని శ్రీ వెంకటేశ్వర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్. సుధాకర్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.చంద్రశేఖరరావు, మ్యాథమెటిక్స్ విభాగాధిపతి డాక్టర్ కె. వెంకటేశ్వర రాజు పాల్గొన్నారు.

నాగలాపురం: ప్రపంచ గణిత మేధావి శ్రీనివాసరామానుజన్ జయంతిని గురువారం మండలంలోని ఎస్.ఎస్.పురం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు గణిత ప్రదర్శనలు చేపట్టారు. ప్రధానోపాధ్యాయురాలు ఉదయచంద్రిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాకాల: మండలంలోని దామలచెరువు ప్రాథమిక పాఠశాలలో గురువారం గణిత శాస్త్రజ్ఞుడు శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు. ప్రధానోపాధ్యాయులు విజయ్‌మోహన్, రెడ్డెప్ప, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ మొహిద్దీన్‌బాషా, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీఎన్‌కండ్రిగ: గణితశాస్త్ర మేధావిగా పేరుగాంచిన శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని గురువారం జాతీయ గణిత దినోత్సవాన్ని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రమణయ్య, గణిత ఉపాధ్యాయులు సురేష్‌బాబు, దేవేంద్ర తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరు రూరల్: గూడూరు రెండో పట్టణ పరిధిలోని వీఎస్‌ఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో మాథ్స్ డే ను గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంఈవో దేవరాజులరెడ్డి, పాఠశాల డైరెక్టర్ బాలకష్ణరాజు, పాఠశాల కరస్పాండెంట్ అన్నపూర్ణ , ప్రధానోపాధ్యాయులు శాంతకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మంగళంలో...

పుత్తూరు టౌన్ : ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ కోటేశ్వరయ్య ఆధ్వర్యంలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గణితశాస్త్ర విభాగ అధ్యక్షులు గాయత్రి, అధ్యాపకులు నరసింహారెడ్డి, వసంత్, విష్ణు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రేణిగుంట: మామండూరులోని కేశవరెడ్డి పాఠశాలలో గురువారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేశవరెడ్డి విద్యాసంస్థల ఛైర్మన్ కేశవరెడ్డి, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోట: కోటలోని శ్రీ చైతన్య పాఠశాలలో ప్రిన్సిపల్ సుధీర్, శ్రీ ప్రగతి విద్యా సంస్థలో కరెస్పాండెంట్ పసుపులేటి కిషోర్, ఎన్‌బీకేఆర్ కళాశాలలో డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, శ్రీనివాస ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో కరెస్పాండెంట్ సురేంద్రరెడ్డి, ఛైర్మన్ దేవసేనమ్మ ఆధ్వర్యంలో శ్రీనివాస రామానుజన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

శ్రీకాళహస్తి: మనిషి తెలివితేటలను పెంచేది గణిత శాస్త్రమని ప్రొఫెసర్ గిరీష్ కుమార్ అన్నారు. పట్టణంలోని జయరామారావు వీధిలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో అంతర్జాతీయ గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్ పాల్గొన్నారు. శ్రీరామ్ నగర్ కాలనీలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం స్కూల్లో ప్రిన్సిపాల్ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో గణిత దినోత్సవం నిర్వహించారు.

చిన్నగొట్టిగల్లు: భాకరాపేట గీతాంజలి పబ్లిక్ స్కూల్‌లో కరస్పాండెంట్ కె.గిరికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో గణిత దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక





ప్రజాశక్తి-బీఎన్‌కండ్రిగ: యూటీఎఫ్ తిరుపతి జిల్లా సహాధ్యక్షులు కె.ఎన్.బి.నవార్యప్రకాష్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి శ్రీకాళహస్తి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండలశాఖ కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. గౌరవాధ్యక్షులుగా రవిచంద్ర, అధ్యక్షులుగా ఎస్.ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శిగా గంటా రమేష్, సహాధ్యక్షులుగా ఎస్.షాహిదా బేగం, శివారెడ్డి కోశాధికారిగా ఎస్.సతీష్‌కుమార్, జిల్లా కౌన్సిలర్లుగా సి.వెంకటకష్ణయ్య, ఎం.వాసుదేవరావు, బి.కోదండరావు, ఓ.దీపిక మహిళా కార్యదర్శిగా ఎం.రోహిణి, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కె.వెంకటేశ్వరరావు, సీపీఎస్ కన్వీనర్‌గా వి.సుధాకర్‌రెడ్డి, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా సతీష్, సాంకేతిక కమిటీ కన్వీనర్‌గా నర్సింగరావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రాజశేఖర్, జిల్లా కార్యదర్శులు శ్రీనివాసులు, దామోదర్‌శెట్టి, రాష్ట్ర కౌన్సిలర్ జయంతి, జిల్లా సాంకేతిక కమిటీ కన్వీనర్ విజయ్‌కుమార్, జిల్లా మహిళా కో కన్వీనర్ దీపిక, అన్ని మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజీఎంలో ఉచిత బూస్టర్ డోస్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో స్థానిక ఎంజీఎం హాస్పిటల్‌లో కో-వ్యాక్సిన్ బూస్టర్ డోస్ ఉచితంగా వేయనున్నట్లు ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.5 లక్షల విలువ చేసే రెండువేల కోవ్యాక్సిన్ బూస్టర్ డోస్‌లను ప్రజలకు ఉచితం గా వేయుటకు సిద్ధంగా ఉన్నామని, శ్రీకాళహస్తి చుట్టుపక్క ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. వివరాలకు ఫోన్‌నంబరు 7288877300 ను సంప్రదించాలని కోరారు. డిసెంబర్ 31వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

మానసిక వికలాంగులకు స్వెటర్ల పంపిణీ



ప్రజాశక్తి-తిరుపతి సిటీ: స్థానిక ఆంజనేయపురం సమీపంలోని మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాల వసతి గహంలో రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం మానసిక వికలాంగులకు స్వెటర్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు హాజరై మాట్లాడారు. ముఖ్యమంత్రి జన్మదినం సందర్భంగా ఏటా సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈ ఏడాది మానసిక వికలాంగులకు శీతాకాలం సందర్భంగా స్వెటర్లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో కొరముట్ల రమణ, వైసీపీ నాయకురాలు లక్ష్మీనారాయణమ్మ, సుధాకర్ రాజు, జనార్దన్ రాజు, మల్లికార్జున , రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కొత్త టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ మెరుగుపరిచి కొత్త టవర్లను ఏర్పాటు చేయాలని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి కోరారు. గురువారం ఢిల్లీలో బి.ఎస్.ఎన్.ఎల్ ఛైర్మన్ కం మేనేజింగ్ డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ పుర్వార్‌ను కలిసి తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని నవాబుపేట, వాకాడు, మిఠాత్మకూరు, గూడూరు నియోజకవర్గాల్లోని రూరల్ ఏరియాలలో, సత్యవేడు నియోజకవర్గం పరిధిలో నందనం, నాగలాపురం, సత్యవేడులోని కొన్ని ప్రాంతాలలో నెట్వర్క్ కవరేజీ పూర్తిగా లేదని..అత్యవసర సమయాలలో ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలో ఈ ప్రాంతాలలో టవర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎంపీ తెలిపారు.

వేపగుంటలో పారిశుద్ధ్య చర్యలు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వేపగుంట పంచాయతీలో గురువారం సర్పంచ్ గిరిజాప్రసాద్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. డ్రైనేజీ కాలువల్లో మట్టిని తొలగించారు. చెత్తాచెదారాన్ని తొలగించి ట్రాక్టర్‌తో చెత్తతో సంపద తయారీ కేంద్రానికి తరలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగమణిపాల్గొన్నారు.



రైతులు ఈ-పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి-నాయుడుపేట: ప్రస్తుతం రబీ సీజన్లో నాయుడుపేట మండలంలోని చుట్టుపక్కల పల్లెల్లో ఇప్పటివరకు 8,247 ఎకరాలలో వరినాట్లు వేశారు. రబీ సీజన్‌కు సంబంధించిన ఈ-పంట నమోదు గ్రామాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు నమోదు చేస్తున్నారు. ఇప్పటి వరకు 1,720 ఎకరాలలో ఈ-పంట నమోదు కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని రైతులు తప్పనిసరిగా ఈ-పంట నమోదు చేయించుకోవాలని నాయుడుపేట ఏవో గణేష్ తెలిపారు.

మాస్కులే కరోనా నివారణకు శ్రీరామరక్ష



ప్రజాశక్తి-గూడూరు రూరల్: కరోనా వైరస్ కొత్త వేరియంట్ బీఎఫ్-7 ప్రపంచ వ్యాప్తంగా మళ్లీ విజంభిస్తున్న తరుణంలో మాస్కులే నివారణకు శ్రీరామరక్ష అని గూడూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ హనుమంతరావు సూచించారు. గురువారం ఆయన ఆధ్వర్యంలో సీహెచ్‌సీలో వైద్యులు, వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానంగా చిన్నపిల్లలకు వేయాల్సిన వ్యాక్సినేషన్ కార్యక్రమం వందశాతం జరిగేలా క్షేత్రస్థాయిలో పూర్తిచేయాలన్నారు. రాష్ట్ర ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సమీక్షలు నిర్వహించి సూచనలు చేయాన్నారు. కరోనా వైరస్ కొత్త వేరియంట్ బీఎఫ్-7కు సంబంధించి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యశాఖ అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు .

వాలంటీర్లు బాధ్యతగా పనిచేయాలి

ప్రజాశక్తి-బాలాయపల్లి: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకా లను ప్రజలకు అందించడంలో వాలంటీర్లు బాధ్యతగా పనిచేయాలని ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వాలంటీర్లకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వినీల్‌కుమార్, సర్పంచ్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల తనిఖీ

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని కొత్తపల్లి గిరిజన కాలనీలోని ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవో మస్తానయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులను పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అమలు చేసిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సూచించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగన్‌ను కలసిన లోకేష్‌యాదవ్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని రేణిగుంట విమానాశ్రయంలో రాష్ట్ర యాదవ కార్పోరేషన్ మాజీ డైరెక్టరు లోకేష్ యాదవ్ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఉన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-కోట: శ్రీ షిరిడి అక్షయ సేవా సమితి నిర్వాహకులు రమణయ్య ఆధ్వర్యంలో గురువారం చిల్లకూరు మండలంలోని కాకువారిపాలెం గ్రామానికి చెందిన గిరిజన కుటుంబాలకు దుప్పట్లు పంపిణీ చేశారు. నెల్లూరు పట్టణానికి చెందిన సాయిసుకేష్, అంజనీవర్మ పుత్రిక సాయి తనిష్కవర్మ పుట్టినరోజు సందర్భంగా తాత రాజశేఖరవర్మ దుప్పట్లను అందించారు.

గ్రామీణ విద్యార్థులకు మెరుగైన ఆంగ్ల విద్య



ప్రజాశక్తి-బీఎన్‌కండ్రిగ: గ్రామీణ విద్యార్థులకు సైతం మెరుగైన ఆంగ్ల విద్యను అందించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని.. ఈ క్రమంలోనే ఎనిమిదో తరగతి విద్యార్థులు, టీచర్లకు ఉచితంగా ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని ఎమ్మెల్యే ఆదిమూలం అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో ఎంఈవో రవీంద్రనాథ్ అధ్యక్షతన ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా 415 మంది విద్యార్థులకు, 59 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు చంద్రశేఖర్‌నాయుడు, ఎంపీడీవో త్రివిక్రమరావు, ప్రధానోపాధ్యాయురాలు విజయకుమారి, అన్ని శాఖల అధికారులు, వైసీపీ మండల కన్వీనర్ విద్యానాథరెడ్డి, జడ్పీటీసీ ప్రతిమారెడ్డి, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పేదింటి బిడ్డల విద్యా ప్రదాత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అని స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎనిమిదో తరగతి విద్యార్థులకు బైజుస్ ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నత విద్యా ప్రమాణాలను నెలకొల్పుతున్న ఏకైక ముఖ్యమంత్రి అంటూ కొనియాడారు. అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




సచివాలయ సిబ్బంది మెరుగైన సేవలందించాలి

ఎంపీపీ యువరాజ్

ప్రజాశక్తి- వీకోట

మండల పరిధిలోని సచివాలయ సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఎంపీపీ యువరాజు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలోని వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వెల్ఫేర్ అసిస్టెంట్లు అందరూ సచివాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండాలని మధ్యాహ్నం భోజన పథకాన్ని సమర్థవంతంగా తనిఖీలు నిర్వహించి విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందే విధంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన గురించి నివేదికలు పంపించాలన్నారు. సచివాలయంలో అందుబాటులో ఉన్న సేవలను గురించి వాలంటీర్ల ద్వారా ప్రజలకు తెలియజేసి ప్రజాసేవలను పెంచాలని సూచించారు. ప్రతిరోజు సాయంత్రం స్పందన కార్యక్రమాన్ని తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీడీవో బాలాజీ వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి- రొంపిచెర్ల: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన తిరుపతి- మదనపల్లి జాతీయ రహదారిలోని బందక్రింద పల్లి వద్ద గురువారం రాత్రి జరిగింది. ఏఎస్ఐ మధు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బందక్రింద పల్లి దళితవాడకు చెందిన దినేష్ (17) మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంలో గురువారం రాత్రి 8 గంటలకు పీలేరు వైపు వెళుతుండగా పీలేరు నుండి తిరుపతి వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంలోని ఇద్దరు కింద పడ్డారు. ఒకరు రోడ్డు మీద పడటంతో తిరుపతి వైపు నుండి వేగంగా వచ్చి గ్యాస్ లారీ దినేష్ తలపై దూసుకెళ్లింది. దీంతో దినేష్ అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. దీంతో గాయపడిన యువకుడిని చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఏఎస్ఐ మధు సంఘటనా స్థలాన్ని సందర్శించి శవాన్ని పంచనామా కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని రొంపిచర్ల తహసీల్దార్ మురాషావలి సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు.

వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ నాశనం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వైసీపీ పాలనలో విద్యావ్యవస్థ నాశనమవుతోందని నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. గురువారం పుత్తూరు మండలం ఉత్తరపు కండ్రిగ, కనకంపాళెం పంచాయతీలలో 'ఇదేం ఖర్మ.. మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి విద్యార్థికి అమ్మ ఒడి పథకంలో రు.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన వైసీపీ నాయకులు ఏటా ఇచ్చే నగదు, లబ్ధిదారుల సంఖ్య తగ్గించి విద్యార్థులు, తల్లిదండ్రులను మోసం చేశారని తెలిపారు. అమ్మఒడి నగదుతో ల్యాప్‌టాప్‌లు ఇస్తామని ఆర్భాటంగా కోట్ల రూపాయల ప్రకటనలు ఇచ్చి.. నేడు ట్యాబ్‌లు ఇచ్చి..మాట తప్పారన్నారు. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో కొందరు సీబీఎస్ఈ, మరికొందరు రాష్ట్ర బోర్డు పరీక్షలు రాసే పరిస్థితి నెలకొందన్నారు. అపద్దపు హామీలు, మోసపు ప్రకటనలు, ఆర్భాటపు ప్రచారంతో విద్యా ప్రమాణాలు దెబ్బతింటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, నియోజకవర్గ పరిశీలకులు డా.చెన్నూరు సుధాకర్, మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, తడుకు సర్పంచ్ బొబ్బిలి, కనకంపాళెం సర్పంచ్ నళినీ కుమారి, కరుణ, పరుశురాం, వాసు, ప్రకాష్, వెంకటేష్, కిషోర్, వెంకటయ్య, వీరరాఘవులు, మురళీకష్ణ, సుధాకర్‌నాయుడు, మహేష్, కృష్ణమూర్తి, కోటయ్య పాల్గొన్నారు..



పెళ్లకూరు: మండలంలోని కొత్తూరులో గురువారం సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో 'ఇదేమి ఖర్మ.. ఈ రాష్ట్రానికి' కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల ప్రెసిడెంట్ కష్ణయ్య, కార్యదర్శి దేవేంద్రరెడ్డి, నాయకులు గోపాల్ రెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.